

సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు
నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
మార్పులు, చేర్పులకు అవకాశం
7

భవిష్యత్తుకు భరోసా.. ఫార్మసీ..!
కోర్సులతో మెండైన ఉపాధి అవకాశాలు
ప్రారంభమైన ప్రవేశాల ప్రక్రియ
32 కళాశాలలు.. 1481 సీట్ల కేటాయింపు
7



చెలరేగిన దొంగలు..
ఒకే రోజు ఐదు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం
కాపర్ వైరు చోరీ
చోద్యం చూస్తున్న పోలీసులు
7



ఇంటి ఎదుట శవంతో నిరసన
విద్యుదాఘాతంతో యువకుడి మృతి
కారణమైన వ్యక్తి ఇంటి వద్ద బంధువుల ఆందోళన
7



పరాయి పంచనే... పాలన..!



- కొత్త జిల్లాలో అన్నీ సమస్యలే
- జిల్లా అధికారుల కార్యాలయాలకూ దిక్కులేదు
- సత్యసాయి సెంట్రల్ ట్రస్టు భవనాల్లోనే పాలన
- పాఠశాలలో డీఈఓ కార్యాలయం
- చదువులకు ఆటంకం

పుట్టపర్తి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం శాపంగా మారింది. అప్పట్లో వైసీపీ పాలకులు పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను ఆర్భాటంగా ప్రకటించారు. అడ్డదిడ్డంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేసి, గత పాలకులు వదిలేశారు. కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. జిల్లా అధికారుల కార్యాలయాలకు సొంత భవనాలు కూడా లేవు. చిన్న చిన్న గదుల్లోనే సర్దుకోవాల్సి వస్తోందని అధికారులు, ఉద్యోగులు వాపోతున్నారు. అధికారులు ఒకరు కూర్చుంటే.. మరొకరు నిలబడాల్సిన దుస్థితి నెలకొందని వారు ఆవేదన చెందుతున్నారు. అవి కూడా సత్యసాయి సెంట్రల్ ట్రస్టు భవనాల్లోనే 90 శాతం నిర్వహిస్తున్నారు. జిల్లాకు గుండెలాంటి కలెక్టరేట్ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సంగీత కళాశాలలో ఏర్పాటు చేశారు. సత్యసాయి ఎయిర్ పోర్టు దగ్గర పర్తిసాయి ధర్మశాలలో ఎస్పీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. పుట్టపర్తిలోని సత్యసాయి దీనజనోద్ధరణ భవనంలో 19 శాఖలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద సత్యసాయి ట్రస్టు భవన సముదాయంలో 12, కొత్తచెరువు, బుక్కపట్నంలో కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాయాలు మినహా అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస సౌకర్యాల్లేవు. ఓ టేబుల్, కుర్చీ వేసుకోవచ్చు. ప్రభుత్వం కేటాయించిన భవనాల్లో ఉండలేక కొన్ని శాఖలు ప్రైవేటు అద్దె భవనాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పోలీసు శాఖకు సంబంధించి సీసీఎస్, కమాండ్ కంట్రోల్, డీటీసీ అనంతపురం నుంచే పనిచేస్తున్నాయి. కొత్త జిల్లాకు కేటాయించిన పోలీసులు, సిబ్బంది ఇబ్బందులు వర్ణనాతీతం. వారిని కొత్త జిల్లా ఏర్పాటు సమయంలో ఎలాగోలా ఒప్పించి, తీసుకొచ్చారు. నేటికీ వసతులు కల్పించకపోగా.. ఉన్నవాటితోనే నెట్టుకొస్తున్నారు. వసతులు లేక చాలా విభాగాల సిబ్బంది ఉమ్మడి అనంతపురం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.



పాఠశాలలోని డీఈఓ కార్యాలయ ఆవరణలో కార్లు



పుట్టపర్తిలోని జిల్లా కార్యాలయాలు

చదువులకు ఆటంకం

పాఠశాల అవరణలో ప్రభుత్వ కార్యాలయాలు ఉండకూడదన్న మార్గదర్శకాలను కొత్త జిల్లాలో తుంగలో తొక్కారు. జిల్లా విద్యాశాఖే వాటిని బేఖాతరు చేయడం గమనార్హం. జిల్లా విద్యాశాఖ కార్యాలయం కొత్తచెరువు గాంధీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలోని ఎమ్మార్సీ భవనంలో నిర్వహిస్తున్నారు. రోజూ డీఈఓ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం అధికారులు, ఉద్యోగులు, టీచర్లు వస్తుంటారు. కార్లు, బైక్‌లలో వస్తుంటారు. వాటి శబ్దాలు, వారి సందడితో విద్యార్థుల చదువులకు ఇబ్బంది ఏర్పడుతోంది. డీఈఓ కార్యాలయం వల్ల తమ పిల్లల చదువులకు అసౌకర్యం ఏర్పడుతున్నట్లు గతంలో కలెక్టర్‌కు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు చేశారు. జిల్లా కార్మిక శాఖ కార్యాలయం కొత్తచెరువు బీసీ కాలనీలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా హాస్టల్ విద్యార్థులకు ఇబ్బందిగా మారింది.

సంచార నేత్ర వైద్యశాల ప్రారంభం



సంచార నేత్ర వైద్యశాల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లోని మారుమూల గ్రామాల్లో సేవలందించే సంచార వైద్యశాల వాహనాన్ని స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారు. వాహనానికి పూజలు చేసి, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు, సేవాసంస్థలు సంయుక్తంగా సత్యసాయి నేత్రమిత్ర పేరిట మొబైల్ ఐక్లినిక్ సేవలను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆ రెండు రాష్ట్రాల్లోని మారుమూల గ్రామాల్లో ఆధునిక వైద్య సేవలు అందించడానికి మొబైల్ క్యాంప్‌ను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో హైదరాబాద్ భక్తులు రెండోరోజు ఆదివారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. మొదట సౌమ్య వారణాసి బృందం గానంతో భక్తులు తన్మయం పొందారు. అనంతరం బాలవికాస్ చిన్నారులు శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు, హనుమంతుడు అంటూ నృత్యాన్ని ప్రదర్శించారు. భక్తిపాటలు, నృత్యంతో అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



రామాయణ నాటికలోని ఓ సన్నివేశం

పోలీసు స్టేషన్‌లో ఉషశ్రీ హల్‌చల్

- పోలీసులపై మండిపడ్డ వైసీపీ నేత
- అన్నదమ్ముల భూవివాదంలో ఒకరికి గాయాలు
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు
- నిందితుడికి 14 రోజుల రిమాండ్



పెనుకొండ స్టేషన్‌లో పోలీసులపై చిందులేస్తున్న ఉషశ్రీ

పెనుకొండ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు కేసు వద్దు రాజీ అవుతామని చెప్పినా ఉద్దేశ్యపూర్వకంగా కుటుంబాన్ని వేధిస్తూ రాత్రంతా ఓ రైతును ఆసుపత్రికి పంపకుండా పోలీస్ స్టేషన్‌లో పెట్టడం దారుణం.. అక్రమ నిర్బంధాలు సరికాదు, పోలీసుల తీరు మారాలి' అంటూ పెనుకొండ పోలీస్ స్టేషన్‌లో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ ఆదివారం పోలీసులపై చిందులు తొక్కారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అన్నదమ్ముల భూవివాదంలో శనివారం జరిగిన ఘర్షణలో ముకుంద అనే రైతు గాయపడ్డాడు. ముకుంద, అతడి తల్లి రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు.. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదుచేసి నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా 14రోజుల రిమాండు విధించారు. మావటూరు గ్రామంలో చాకలి అంజినప్ప, చాకలి సుబ్బయ్య అన్నదమ్ములు. చాకలి సుబ్బయ్య భార్య ముత్యాలమ్మపేరిట ప్రధాన రహదారిలో నాలుగు ఎకరాల భూమి ఉంది. చాకలి అంజినప్ప, చాకలి సుబ్బయ్య కుమారులైన శ్రీనివాసులు, ముకుంద ఉమ్మడిగా సాగుచేసుకుంటున్నారు. శనివారం చాకలి శ్రీనివాసులు సాగు భూమిలో ముకుంద సాగుచేస్తున్న పొలం నీరు వెళ్లకుండా అడ్డుకట్టవేశాడు. ఈ క్రమంలో జరిగిన గొడవలో శ్రీనివాసులు చేతిలో ఉన్న చెలికిపారతో ముకుంద తలపై మోదాడు. తీవ్ర రక్త గాయమైన ముకుంద, తల్లి రామలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదుచేశారు. విచారణ అనంతరం శ్రీనివాసులుపై 307కేసు నమోదుచేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయాధికారి 14రోజుల రిమాండు విధించారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ స్టేషన్‌కు చేరుకుని అన్నదమ్ముల గొడవ రాజీచేస్తారని మీవద్దకు వస్తే హత్యాయత్నం కేసు ఎలా నమోదు చేశారని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.500 కోసం గొడవ

- మామ గొంతు కోసిన అల్లుడు



గాయపడిన రఫీక్

హిందూపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో రూ.500 కోసం గొడవపడి మామ గొంతును అల్లుడు కోశాడు. తీవ్ర గాయాలతో మామ ఆస్పత్రి పాలయ్యాడు. రహమత్‌పురంలోని మసీదు సమీపాన రఫీక్ నివాసం ఉంటున్నాడు. అతడికి వరుసకు అల్లుడైన చాంద్‌బాషా ఆదివారం రాత్రి కలిశాడు. మద్యం మత్తులో గొడవపడ్డారు. తాను రూ.500 ఇచ్చాననీ, ఆ బడ్డు ఇవ్వాలంటూ చాంద్‌బాషా డిమాండ్ చేశాడు. తాను డబ్బు తీసుకోలేదని రఫీక్ చెప్పినా వినలేదు. దీంతో ఇరువరి మధ్య మాటామాటా పెరిగింది. ఇంతలో చాంద్‌బాషా వద్ద ఉన్న రేషం కత్తిరించే చాకుతో రఫీక్ గొంతుకోశాడు. వెంటనే అక్కడున్నవారు అడ్డుకున్నారు. తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడికి ప్రాణాపాయం తప్పిందన్నారు. దీనిపై కేసు నమోదుచేసినట్లు టూటౌన్ సీఐ కరీం తెలిపారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నిర్మూలన


- కలెక్టర్ టీఎస్ చేతన్
- ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ర్యాలీ

పుట్టపర్తి టౌన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే హెచ్‌ఐవీని నిర్మూలించగలమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా జిల్లా కేంద్రంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కలెక్టర్ జెండా ఊపి, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్‌కు మందులేదనీ, నివారణ ఒక్కటే మార్గమన్నారు వ్యాధిగ్రస్తులు అధైర్యపడకూడదన్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మంజువాణి, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ఇన్‌చార్జి అయితే.. మాకేంటి..?



లేపాక్షి మండల నాయకులతో సమావేశమైన నవీన్ నిశ్చల్

- వైసీపీ మండల కన్వీనర్ ఎంపికపై నవీన్ నిశ్చల్ సమావేశం
- ఒక వర్గానికి సజ్జల.. మరో వర్గానికి పెద్దిరెడ్డి అండ
- శ్రేణుల్లో అయోమయం

హిందూపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సాధారణంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలోనే పార్టీ సంస్థాగత పదవులు ఎంపిక చేపడతారు. హిందూపురం వైసీపీలో మాత్రం విభిన్న పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఇన్‌చార్జి ఉన్నా.. వారికి తెలియకుండానే పార్టీలో పదవులు వస్తుంటాయి, పోతుంటాయి. తాజాగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక ఆధ్వర్యంలో కాకుండా ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్ నిశ్చల్ సమక్షంలో ఆయన కార్యాలయంలోనే లేపాక్షి మండలానికి సంబంధించిన మెజార్టీ నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. లేపాక్షి మండల కన్వీనర్ పదవిని ఆ పార్టీ సీనియర్ నాయకుడైన బిసలమానేపల్లి వేణుగోపాల్ రెడ్డికి ఇచ్చేందుకు ప్రస్తుతం ఆ బాధ్యతలు చూస్తున్న నారాయణస్వామితోపాటు ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంతకాలు చేశారు. దీనిని బట్టి హిందూపురం వైసీపీలో ఇన్‌చార్జి దీపిక, నవీన్ నిశ్చల్ మధ్య వర్గపోరు తారస్థాయికి చేరినట్లు స్పష్టమవుతోంది. ఇన్‌చార్జి అయితే మాకేంటి అనే ధోరణిలో నవీన్‌వర్గీయులు ముందుకెళ్తున్నారు. గతంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఇక్బాల్ ఉన్నపుడు ఆయనను కాదని అప్పట్లో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నవీన్‌నిశ్చల్ మూడు మండలాలకు వైసీపీ కన్వీనర్లను ఎంపిక చేశారు. ఆ తరువాత అధిష్టానం సూచనతో వారికి బాధ్యతలు ఇవ్వకుండా ఇక్బాల్ మాటే నెగ్గించుకున్నారు. ప్రస్తుతం కూడా అదే తరహా రాజకీయ పరిణామాలు సాగుతున్నాయి. వీటిపై దీపిక ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

అటు సజ్జల.. ఇటు పెద్దిరెడ్డి..

హిందూపురం వైసీపీలో మూడు వర్గాలుగా ఉన్నారు. ఇందులో ఇన్‌చార్జి దీపికకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులుండగా.. నవీన్ నిశ్చల్‌కు సజ్జల రామకృష్ణారెడ్డి అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వారం క్రితం వర్గపోరుపై తెలుసుకునేందుకు అధిష్టానం దూతలను హిందూపురం పంపారు. ఆ రోజు వచ్చిన దూతలను నవీన్‌నిశ్చల్ వద్దకు వెళ్లకుండా దీపికవర్గం సమయం గడిపి నిలువరించగలిగింది. దీనిపై పార్టీ అధినేతను కలిసి వివరించేందుకు నవీన్ వర్గం సిద్ధమైంది. ఈ పరిస్థితుల్లో దీపిక వర్గీయులు హిందూపురంలో పార్టీ అభివృద్ధి కావాలంటే కొంతమందిని సస్పెండ్ చేయాలని పట్టుబడుతున్నారు. మరో రెండు వర్గాలు మాత్రం దీపికను ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించి, స్థానికులకు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్‌ను నవీన్ వర్గీయులు వారంలోగా జగన్ వద్దకు తీసుకెళ్లనున్నట్లు తెలిసింది. ఎన్నికల ముందు ఇక్బాల్‌ను తప్పించి, దీపికను ఇన్‌చార్జిగా నియమించడంలో పెద్దిరెడ్డి పాత్ర కీలకం అన్నది బహిరంగ రహస్యమే. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నవీన్ నిశ్చల్‌కు అవకాశం కల్పించడం, ఆగ్రోస్ చైర్మన్ పదవి ఇప్పించడంలో సజ్జల సహకరించారని ఆ పార్టీలో చర్చ సాగుతోంది. ఈ పరిస్థితుల్లో హిందూపురంలో ఒకే పార్టీకి ఉన్నతస్థాయిలో ఉన్న నాయకులు ఒక్కొక్కరు ఒక్కో వర్గాన్ని వెనకేసుకురావడంతో స్థానికంగా విభేదాలు పెరుగుతున్నాయి.

అధిష్టానం ఆశీస్సులు ఎవరికో...

ఒక వర్గానికి ఒక నాయకుడు సహకారం అందిస్తున్నాడు. ప్రస్తుతం పార్టీ అధికారంలో లేదు కాబట్టి, అధిష్టానం వద్దకు వెళ్తే పురం పంచాయితీ ఎలా తేలుస్తారో చూడాల్సి ఉంది. దీపిక, నవీన్‌నిశ్చల్‌కు సజ్జల, పెద్దిరెడ్డి అండకంటే ముఖ్యం అధిష్టానం వద్ద ఎవరికి మార్కులు ఎక్కువగా ఉన్నాయో తెలియని పరిస్థితి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాకు సంబంధించి పార్టీ వ్యవహారాలు చూస్తున్నారు. సజ్జల పైస్థాయిలో చక్రం తిప్పగలడు. దీనినిబట్టి హిందూపురం ఇన్‌చార్జి పదవి దీపికకు ఉంటుందా, ఊడుతుందా అనేది మరికొద్దిరోజుల్లో తేలనుందని ఆ పార్టీలో చర్చించుకుంటున్నారు.

కార్యకర్తల్లో అయోమయం

గత ఐదేళ్లలో పలువురు ఇన్‌చార్జిలను మార్చారు. ప్రస్తుతం పార్టీ అధికారంలో లేదు. అయినా పురంలో వర్గపోరు మాత్రం సమసిపోలేదు. ఎవరికి వారే ఇన్‌చార్జి అన్న తరహాలో వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది నాయకులు, కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. అధిష్టానం ఆశీస్సులు ఏ నాయకుడికి దక్కుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీపికను కొనసాగిస్తారా, నవీన్‌నిశ్చల్‌కు అప్పగిస్తారా అనేది స్పష్టత లేకపోవడం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆందోళనలో పడేస్తోంది. అధిష్టానం ఏదో ఒకటి తేల్చకపోతే పరిస్థితి ఇబ్బందిగా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.33



అనంతపురం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 975 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 26, కనిష్ఠ ధర రూ. 20 పలికినట్లు ఆయన తెలిపారు.

ఓపీఎస్ పునరుద్ధరణ కోరుతూ
10న చలో విజయవాడ

అనంతపురం విద్య, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని ఈ నెల 10న చలో విజయవాడ నిర్వహించనున్నట్లు ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు ప్రేమనాథరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానంటూ హామీ ఇచ్చి ఉద్యోగులను నిలువునా మోసం చేసిందన్నారు. ఉద్యోగులపై అక్రమ కేసులు పెట్టిందని మండిపడ్డారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు సీపీఎస్ విధానంపై ఏడాదిలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారని, నారా లోకేష్ సైతం ఉద్యోగులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని గుర్తుచేశారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయడం రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్, భాగ్యరాజ్, శివశంకర్‌రెడ్డి, రామాంజనేయులు, గోపాల్‌రెడ్డి, రంగనాథ్, భాష, సుధాకర్ పాల్గొన్నారు.

వాహన్, సారథి పోర్టల్ ద్వారా దరఖాస్తులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ అన్ని సేవలకు ఈనెల 3వతేదీ నుంచి వాహన్ లేదా సారథి పోర్టల్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి వీర్రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచి ఈ ప్రగతి పోర్టల్‌లో రవాణా శాఖ సేవలను నిలిపివేస్తామన్నారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టాలీప్రైమ్, జీఎస్టీ, అడ్వాన్స్ ఎక్సెల్ కోర్సుల్లో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ కల్పిస్తామని ఉన్నతి కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. బీకాం, ఎంకాం చదివి 20-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు విజయవాడలో 60 రోజుల పాటు ఉచిత శిక్షణ, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కోర్సులో అదనంగా కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు నెలకు రూ. 18వేలకు పైగా వేతనంతో కూడిన ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

1.681 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.681 టీఎంసీల నీటి నిల్వ వున్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో ఇన్‌ఫ్లో 861 క్యూసెక్కులుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 798 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

భవిష్యత్తుకు భరోసా... ఫార్మసీ

- కోర్సులతో మెండైన ఉపాధి అవకాశాలు
- ప్రారంభమైన ప్రవేశాల ప్రక్రియ
- 32 కళాశాలలు, 1481 సీట్ల కేటాయింపు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయనున్న ప్రభుత్వం



జేఎన్‌టీయూ ముఖద్వారం

కోర్సులు, జిల్లాల వారిగా సీట్ల సంఖ్య వివరాలు

కోర్సులు	అనంతపురం	చిత్తూరు	కడప	కర్నూలు	నెల్లూరు
బి.ఫార్మసీ	128	240	224	85	520
డాక్టర్ ఆఫ్ ఫార్మసీ	30	65	52	13	91
ఫుడ్ టెక్నాలజీ	33				
మొత్తం	158	338	276	98	611

జిల్లాలో కళాశాల వారిగా కన్వీనర్ కోటా సీట్ల సంఖ్య

కళాశాల	బీ.ఫార్మసీ	డాక్టర్ ఆఫ్ ఫార్మసీ
జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ	55	17
ఎస్కేయూ	33	--
బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ	40	13
మొత్తం	128	30

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వం తొలి విడత వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించింది. ఏపీ ఈఏపీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులు అడ్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ నెల 6వరకు రిజిస్ట్రేషన్, పేమెంట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియలు కొనసాగుతాయి. ఈ ప్రక్రియలు పూర్తిచేసిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారానే కౌన్సెలింగ్ సెంటర్‌లో పరిశీలిస్తారు. ఏడో తేదీవరకు కళాశాలల ఎంపిక కోసం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. ఆప్షన్లలో ఏవైనా మార్పులు చేసుకోవడానికి 8న అవకాశాన్ని కల్పించారు. కౌన్సెలింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు 11న సీట్లను కేటాయిస్తారు. అదేరోజు నుంచి 14వరకు సబంధిత కళాశాలలో సెల్ఫ్ రిపోర్టు చేసుకోవాలి. విద్యార్థుల సహాయార్థం అనంతపుర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. వివరాలకు 7901620145 నెంబర్‌కు ఫోన్‌చేయాలని కౌన్సెలింగ్ సెంటర్ అడ్మిన్ సుధారాణి సూచించారు.

32 కళాశాలలు, 1481 సీట్లు..

ఈఏపీసెట్ ప్రథమ ఫార్మసీ కౌన్సెలింగ్ ద్వారా జేఎన్‌టీయూ పరిధిలోని ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలోగల 31 ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. కన్వీనర్ కోటాకింద మొత్తం 1448 సీట్లు ఉన్నాయి. ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో 33 సీట్లున్నాయి. ఈ లెక్కన మొత్తం 32 కళాశాలలు, 1481 సీట్లు ఉన్నాయి. వీటిలో బీఫార్మసీ 1197, ఫార్మా-డీ 251, ఫుడ్ టెక్నాలజీ 33 సీట్లను కేటాయించారు. జేఎన్‌టీయూ కలికిరి ఇంజనీరింగ్ కళాశాలలో మాత్రమే ఫుడ్‌టెక్నాలజీ కోర్సు ఉంది. ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన ఎంపీసీ, బైపీసీ రెండు స్ట్రీమింగ్‌ల విద్యార్థులు కౌన్సెలింగ్‌కు అర్హులు.

కళాశాల వారిగా ఫీజులు...

అనంతపురం ఉమ్మడి జిల్లాలో మూడు ఫార్మసీ కళాశాలలకు మొదటి విడత కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్ ప్రక్రియను చేపట్టారు. జిల్లా కేంద్రంలో జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ, ఎస్కేయూ, బాలాజీ ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 128 బీ-ఫార్మసీ, 30 డాక్టర్ ఆఫ్ ఫార్మసీ మొత్తం 158 సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. అర్హత గల విద్యార్థులకు కళాశాల వారిగా ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే ఫీజురీయింబర్స్‌మెంట్ ద్వారా చెల్లిస్తుంది. బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో బీఫార్మసీకి రూ.50700, డాక్టర్ ఆఫ్ ఫార్మసీకి రూ.38000. జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ కళాశాలలో బీఫార్మసీకి రూ.31000, డాక్టర్ ఆఫ్ ఫార్మసీకి రూ.35000. ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీకి రూ.50000 చొప్పున ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుంది.

రూ.6.93కోట్లు చెల్లించనున్న ప్రభుత్వం

మొదటి విడత కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటాలో 1481 సీటను భర్తీ చేయనున్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. ల్యాబ్‌లు, సౌకర్యాలు, మెరుగైన వసతులు ఇలా ప్రామాణికతను బట్టి ఆయా కళాశాలలకు ప్రభుత్వం ఫీజులను నిర్ధారణ చేసింది. ఒక్కో కళాశాలకు రూ.30వేల నుంచి రూ.80వేలకు కోర్సు ఫీజును నిర్ధారించింది. ఈ లెక్కన మొత్తం 1481 సీట్లు భర్తీ అయితే రూ.6.93కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని సంబంధిత కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది.

ఫార్మసీ ఎవర్‌గ్రీన్



ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో ఇంజనీరింగ్‌తో పాటు ఫార్మసీ కోర్స్ ఎవర్‌గ్రీన్‌గా నిలుస్తోంది. నాలుగు సంవత్సరాల బీఫార్మసీ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఉద్యోగాలకు వెళ్తున్నారు. వర్సిటీలో ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటుచేశాం. జేఎన్‌టీయూ పరిధిలోని అన్ని ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు కోర్సు చివరి సంవత్సరంలోనే క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

- ప్రొఫెసర్ సుదర్శనరావు, జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ

స్వయం ఉపాధి



ఫార్మసీ విద్యార్థులకు రెండు వైపులా అవకాశాలున్నాయి. ఉద్యోగులుగా చేరడానికి, స్వయం ఉపాధి పొందడానికి మెండైన అవకాశాలు ఉన్నాయి. ప్రముఖ జాతీయ సంస్థలైన మెడ్‌టెక్, అపోలో వంటి సంస్థల్లోనూ, స్థానికంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఫార్మాసిస్ట్ ఉద్యోగాలు లభిస్తాయి. విద్యార్థి తన ప్రాంతంలో మెడికల్ షాపులను ఏర్పాటుచేసుకుని కూడా స్వయం ఉపాధిని పొందవచ్చు.

- డాక్టర్ సోమశేఖర్, ఎస్కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్

జాబ్ అస్యూరెన్స్



ఫార్మసీ విద్యార్థులకు పక్కాగా ఉద్యోగ భరోసా ఉంటుంది. కోర్సు పూర్తి చేసిన వెంటనే ఫార్మసీ ఇండస్ట్రీలో క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్, ఆర్‌అండ్‌డీ ఇలా వివిధ డిపార్ట్‌మెంట్స్‌లో ఉద్యోగాలు లభిస్తాయి. ఫార్మసీ పరిశ్రమలు తయారు చేసిన మందులను మార్కెట్‌లో అమ్మడానికి మెడికల్ రెప్రజెంటేటివ్స్‌గా అవకాశాలున్నాయి. ఇన్ని అవకాశాలు ఒక్క ఫార్మసీ కోర్సుతోనే దక్కుతాయి.

- డాక్టర్ శ్రీధర్, బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్

సీఎం పర్యటనతో అభివృద్ధికి మార్గం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



రాయదుర్గంటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనతో రాయదుర్గం సమగ్రాభివృద్ధికి మార్గం ఏర్పడిందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు అవసరమైన హంద్రీనీవా తొలిదశ పనులు పూర్తికి స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకు కాలువ విస్తరిస్తామని ప్రకటించారని అన్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలకు అత్యంత ప్రాముఖ్యత కలిగిన జీడిపల్లి, భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తరలించే కార్యక్రమాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. 36ఏ కింద ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 64 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణకు రూ. 600 కోట్లు నిధులు మంజూరు చేస్తామని చెప్పారన్నారు. తుంగభద్ర జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడానికి ఉంతకల్లు - నేమకల్లు గ్రామాల మధ్యలో ఐదు టీఎంసీల సామర్థ్యంతో నేమకల్లు ఆంజనేయస్వామి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించేందుకు ఆమోదం తెలిపారని అన్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో 20 వేల ఎకరాల్లో విస్తరిస్తున్న ఇసుకమేటల నివారణకు శాస్త్రీయంగా అధ్యయనం చేయించి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నేమకల్లును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారన్నారు. డి.హీరేహాళ్ మండలంలో మూడువేల ఎకరాల్లో స్టీల్ పరిశ్రమల పార్క్ మంజూరుకు అంగీకరించారన్నారు. పండ్లతోటల హబ్‌గా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరునెలల పాలనలో ఏ నియోజకవర్గానికి ఇవ్వలేనన్ని హామీలు రాయదుర్గానికి ఇచ్చారని పేర్కొన్నారు. బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట గ్రామానికి హెచ్చెల్సీ జలాలను మళ్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ రైతులు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బొమ్మనహాళ్ మండల కన్వీనర్ బలరామిరెడ్డి, టీడీపీ నాయకులు పూజారి శివ, బండి చిన్న, పసుపులేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

మార్పులు, చేర్పులకు అవకాశం

అనంతపురం టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు సంక్రాంతి పండుగకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కొత్తరేషన్ కార్డుల జారీతో పాటు పాతకార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. రేషన్ కార్డుల కోసం గత ఐదేళ్లుగా ఎదురు చూస్తున్న పేదలు కూటమి ప్రభుత్వ నిర్ణయంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా సాగింది. సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్న కొన్ని గంటలకే రేషన్‌కార్డులు ఇస్తామని అప్పటి సీఎం జగన్ గొప్పలు చెప్పారు. ఐదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోగా.. పథకాల లబ్ధి కోసం రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులకు కూడా అవకాశం కల్పించలేదు. దీంతో ఐదేళ్లుగా పేదలు రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. అలాంటి వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుభవార్త ప్రకటించారు. సచివాలయాల్లో ఈనెల 28వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

వివాహ ధ్రువ పత్రం చూపిస్తే కొత్తకార్డు

అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 6.62 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇంకా చాలా మంది కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇందులో కొత్త జంటలకు కొత్త రేషన్ కార్డులు జారీచేయనున్నారు. వివాహ ధ్రువ పత్రం దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా పరిశీలించి అర్హత ఉన్న కొత్తజంటలకు నూతన రేషన్ కార్డులు జారీచేస్తారు. సంక్రాంతి పండుగకు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి:

వెంకటేశ్వర్లు, డీఎస్ఓ

కొత్త రేషన్‌కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సోమవారం నుంచి సచివాలయాల్లో దరఖాస్తులను తీసుకుంటారు. మార్పులు, చేర్పులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను పక్కాగా పరిశీలించిన అనంతరం అర్హులందరికి కొత్తకార్డులు మంజూరు చేస్తాం. సంక్రాంతి పండుగకు నూతన రేషన్‌కార్డులు అందించే అవకాశం ఉంది. అర్హత ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలి.

వడ్డెర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కుంచెపు వెంకటేష్

పలువురు శుభాకాంక్షలు



కుంచెపు వెంకటేష్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా వడ్డెర్ల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఐదో రోడ్డులోని సాయిబాబా ఆలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడిగా కుంచెపు వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా హనుమయ్య, ఉపాధ్యక్షులుగా నాగరాజు, శ్రీనివాసులు, కోశాధికారిగా పెద్దమారెప్ప, కార్యదర్శిగా వెంకటపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధాకర్, సహాయ కార్యదర్శులుగా నారాయణస్వామి, శ్రీరాములు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడికి పలువురు నాయకులు, వడ్డెర్లు పూల మాలలు వేసి, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి, ఇతర నాయకులు, వడ్డెర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో వడ్డెర్ల సంక్షేమం కోసం నిరంతరంపాటు పడతా అన్నారు. ప్రభుత్వం నుంచి వడ్డెర్లకు దక్కాల్సిన లబ్ధిని చేకూరేలా కృషి చేస్తా అన్నారు. వడ్డెర్లు అందరూ ఐకమత్యంతో ఉన్నప్పుడే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి అంజినప్ప, నగర అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు ఆంజనేయులు, మునిస్వామి, నాగేంద్ర, శేఖర్, రాజు, పెద్దన్న, రవీంద్ర, లక్ష్మీదేవి, ముత్యాలమ్మ, రామాంజినేయులు, మంజునాథ్ పాల్గొన్నారు.

జీసీటీఏ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం (జీసీటీఏ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ కోనంకి శ్రీధర్, బాలాజీ నాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 75 మంది అధ్యాపకులు ఓటును వినియోగించుకున్నారని రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన పెనుకొండ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు జయప్ప తెలిపారు. 50 ఓట్లు శ్రీధర్‌కురాగా, వెంకటేష్‌కు 25 ఓట్లు పడ్డాయని తెలిపారు. దీంతో శ్రీధర్ ప్యానల్ జిల్లా కార్యదర్శిగా బాలాజీ నాయక్, ట్రెజరర్‌గా నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని శ్రీధర్, బాలాజీనాయక్ తెలిపారు. అనంతర నూతన కార్యవర్గానికి పలువురు అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్టీయూ శ్రీసత్యసాయి జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి

అనంతపురం విద్య, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ శ్రీసత్యసాయి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ స్కూలులో పీఆర్టీయూ ఉమ్మడి అనంతపురం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకుడు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నూతన పీఆర్సీ ప్రకటించాలని, 30 శాతం ఐఆర్ వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రజనీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, తిమ్మారెడ్డి శ్రీరాములు, నరసింహులు, రంగారెడ్డి, చంద్రశేఖర్, రామిరెడ్డి, ఉమాదేవి తదతరులు పాల్గొన్నారు.

చెలరేగిన దొంగలు

ఒకేరోజు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

కాపర్ వైరు చోరీ...

చోద్యంచూస్తున్న పోలీసులు



రంగమ్మ తోటలో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

యాడికి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కేబుల్ వైర్ల దొంగలు చెలరేగిపోయారు. యాడికి మండలం చందన గ్రామంలో శనివారం రాత్రి దొంగలు ముగ్గురు రైతుల తోటల్లో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైరును చోరీ చేశారు. చందన గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి, రంగమ్మ, రంగారెడ్డి మొక్కజొన్న, అరటి పంటలను సాగుచేశారు. శనివారం రాత్రి తోటల్లో దొంగలు పడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్లకు కరెంట్ కనెక్షన్లు కట్‌చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం తోటల వద్దకు వెళ్లిన రైతులు తమ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి దోచుకెళ్లడం చూసి లబోదిబోమన్నారు. పంటలకు సాగునీరు అందించేది ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను ఇక ఎండ బెట్టుకోవాల్సిందేనా అంటూ కన్నీరుకార్చారు. తమకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చేదెప్పుడు...? సాగుచేసిన పంటలు కాపాడుకొనేది ఎప్పుడూ అంటూ వాపోయారు. ఇప్పటి వరకు దైవాలమడుగు గ్రామంలో దొంగలు వరుసగా కేబుల్ వైర్లు దొంగతనం చేసి రైతులను నష్టపరిచారు. ఇప్పుడు ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టారు.

అసలు పోలీసులు ఉన్నారా..?

యాడికి మండలంలో అసలు పోలీసులు ఉన్నారా? అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతమంది రైతుల కడుపుకొట్టి దొంగలు యథేచ్ఛగా చోరీలు చేస్తుంటే పోలీసులు ఏమిచేస్తున్నట్లు అని మండల రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తోటల్లో దొంగతనం జరిగిందని రైతులు ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు వెళితే.. వారి సూటిపోటీ మాటలతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు రైతులు తెలిపారు. వ్యవసాయ తోటలో జరుగుతున్న కేబుల్‌వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడమే మానుకున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా జరుగుతున్న కేబుల్‌వైర్ల చోరీ, ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్న సంఘటనలతో పోలీసు వ్యవస్థపై మండల రైతాంగం నమ్మకం కోల్పోయిందనడంలో సందేహం లేదు.

ఇంటి ఎదుట శవంతో నిరసన

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కారణమైన వ్యక్తి ఇంటి వద్ద బంధువుల ఆందోళన





మృతికి కారణమైన వ్యక్తి ఇంటి ఎదుట శవంతో బంధువుల నిరసన, శివ (ఫైల్)

కూడేరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోళసముద్రం గ్రామ సమీపం తోటలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌లో హెడ్ ఫ్యూజులు వేస్తూ, విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన కురుబ చిత్రా శివ (28) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 2న చోళసముద్రం గ్రామానికి చెందిన నాపా నాగరాజు తోటలో ట్రాన్స్‌ఫార్మర్‌కు హెడ్ ఫ్యూజులు పోయాయి. దీంతో కరెంటు ఆఫీసు నుంచి ఎల్‌సీ తీసుకున్నానని చెప్పి ఫ్యూజులు వేయడానికి గ్రామానికే చెందిన కురుబ చిత్రా శివను తోటకు తీసుకెళ్లాడు. నాగరాజు చెప్పిన మాటలు విని శివ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. అయితే ఆ సమయంలో కరెంటు సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన శివను వెంటనే అనంతపురం తరలించారు. నెల రోజులు పాటు మృత్యువుతో పోరాడి ఆదివారం మృతి చెందాడు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, బంధువులు మృతికి కారణమైన నాపా నాగరాజు ఇంటి వద్ద శవంతో నిరసనకు దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని బాధితులతో చర్చించారు. మృతుడికి భార్య ఆశతో పాటు ఆరు నెలల చిన్నారి ఉండటంతో న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. మృతికి కారణమైన వ్యక్తి వచ్చే వరకు శవం తరలించేది లేదని పోలీసులకు తేల్చి చెప్పారు. దీంతో పోలీసులు శాంతి భద్రతలు సమస్య రాకుండా బందోబస్తు నిర్వహించారు.

న్యూస్ బాక్స్...

రేపట్నుంచి ఫిర్యాదుల స్వీకరణ

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఈనెల 3 నుంచి 31వతేదీ వరకు ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం తాడిమర్రిలో ప్రారంభమవుతుందనీ, ప్రజలు సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

మండలాధ్యక్షుడిని నియమించండి

గాండ్లపెంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలాధ్యక్షుడు తాతాం జగన్మోహన్ గత జూలై 8న తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి మండలాధ్యక్షుడిని నియమించకపోవడంతో ఉపాధ్యక్షురాలు గంగోజమ్మ ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. దీంతో పలు అభివృద్ధి పనులు కుంటుపడుతున్నామని, అధికారులూ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు, ప్రజాప్రతినిధులు అంటున్నారు. వెంటనే మండలాధ్యక్షుడిని నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్‌టీపీఏ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా శివశంకర్



తనకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తనను నోబుల్ టీచర్స్ అసోషియేష్ (ఎన్‌టీపీఏ) రాష్ట్ర అదనపు కార్యదర్శిగా ఆదివారం నియమించినట్లు మండలంలోని దేవళం తండా పాఠశాల ఉపాధ్యాయుడు శివశంకర్‌ను తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం

కదిరి అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సమావేశాన్ని కదిరి శాఖ అధ్యక్షుడు ఫకృద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు హాజరయ్యారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. జిల్లా కార్యదర్శిగా ఎంపికైన రామాంజనేయులను సన్మానించారు. కార్యక్రమంలో ఆత్మారెడ్డి, డాక్టర్ నాగేంద్రనాయక్, గోపీనాయక్, రామచంద్రారెడ్డి, దేవలానాయక్, సుజాత, ఉపేంద్ర, ప్రసాద్, చిన్నయ్యశెట్టి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కదిరి అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూనే ఉంటామని ఖాద్రీ వడ్డెర సంక్షేమ సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం సైదాపురంలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణమండపం ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో డివిజన్‌లోని పలు మండలాల వడ్డెర్లు హాజరయ్యారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాబా గంగయ్య మాట్లాడుతూ.. కళ్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలని కోరారు. స్థల సేకరణకు సహకరించిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సంపంగి గోవర్ధన్, సైదాపురం రమణ, నరసింహులు, చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మల్లూరమ్మకు పూజలు



అలంకరణలో మల్లూరమ్మ

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారప్పగారిపల్లి, తొట్లివారిపల్లి, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఆదివారం కార్తీక, అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారప్పగారిపల్లిలో మల్లూరమ్మను ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, పూజలు చేశారు. వ ందలాది మంది భక్తులకు అన్నసంతర్పణం చేశారు.

జవాన్‌కు నివాళి



నివాళులు అర్పిస్తున్న పోలీసులు

నల్లమాడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ రామమోహన్ 2014లో చత్తీస్‌ఘడ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించారు. ఆదివారానికి పది సంవత్సరాలు పూర్తికావడంతో సీఆర్‌పీఎఫ్ ఢిల్లీ నుంచి ఏఎస్ఐ ఏపీ రాజు, నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఏఎస్ఐ సత్యనారాయణ ఆ గ్రామానికెళ్లి జవాన్ రామమోహన్ సమాధి వద్ద నివాళులు అర్పించారు. వారివెంట జవాన్ తల్లిదండ్రులు, పోలీసులు ఉన్నారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేద్దాం

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 5న నిర్వహించే హైందవ శంఖారావం కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా సత్సంగ్ ప్రముఖ్ వేదవ్యాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తొట్లివారిపల్లి దుర్గామాత ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పిట్టా ప్రభాకర్‌రెడ్డి, కోటా నాగేశ్వరయ్య, చంద్ర, నరసింహారెడ్డి, తొట్లి వెంకటరంగారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ధర్మవరం : కార్తీక మాసం ఆఖరి రోజు సందర్భంగా స్థానిక శివానగర్ లోని కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో భక్తులకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఆదివారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, జనసేన నాయకులు రాజారెడ్డి, బెస్తశ్రీనివాసులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మధుసూదన్ రెడ్డి

మాలధారణం.. నియమాల తోరణం

- పెరుగుతున్న ఆధ్యాత్మిక చింతన
- ఏటా అధికమవుతున్న అయ్యప్ప భక్తులు
- 41 రోజుల దీక్షతో క్రమశిక్షణ మెరుగు
- గ్రామాల్లో సైతం అయ్యప్ప శరణు ఘోష

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్వామియే శరణం అయ్యప్పా... అంటూ స్వాముల శరణుఘోషతో ప్రస్తుతం పట్టణాలు, గ్రామాలు మార్మోగుతుఉన్నాయి. స్వాముల మాలధారణతో ఆధ్యాత్మిక చింతన భావం పెరుగుతోంది. ఈ 41 రోజుల పాటు స్వామి వారి కఠిన దీక్షతో మంచి ఆరోగ్యం కూడా లభిస్తుంది. ఏటా అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో స్వాములు మాలధారణ చేస్తుంటారు. కార్తీక మాసం, ధనుర్మాసం రెండు నెలల్లో మండలి దీక్ష, మకరజ్యోతి దర్శనానికి వెళ్లే భక్తులతో శబరిమల కిటకిటలాడుతుంది. ఈ ఏడాది అధిక సంఖ్యలో స్వాములు మాల ధరించారు. ఉమ్మడి జిల్లాలో సుమారు లక్షమంది స్వాములు మాల ధరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది గ్రామాల్లో స్వాముల సంఖ్య మరింత పెరిగింది.

● క్రమశిక్షణకు మారు పేరు : స్వామి మాలధారణ 41 రోజుల పాటు నియమ, నిష్టలతో ఆచరించే స్వాములు శారీరకంగా , మానసికంగా ప్రశాంతంగా ఉంటారు. ప్రవర్తనలో చాలా మార్పు వస్తుంది. సత్ప్రవర్తన మంచి ఆలోచనకు దారితీస్తుంది. శాకాహారం తీసుకోవడం, చిన్న,పెద్ద, కుల, మత, ఆర్థిక తారతమ్యం లేకుండా అందరూ ఒక చోట ఉండి పూజలు చేస్తుంటారు. మాలధారణ చేసిన భక్తులు 41 రోజుల పాటు కఠోర దీక్ష చేస్తారు. అనంతరం గురుస్వాములు ద్వారా ఇరుముడినని కట్టి కేరళ రాష్ట్రంలోని శబరిమలకు వెళ్లి ఇరుముడిని అయ్యప్పకు సమర్పిస్తారు. అక్కడకు వెళ్లలేని స్వాములు ద్వారపూడిలో అందజేస్తారు.



అయ్యప్పపూజ



భజనలు చేస్తున్న మాలధారులు

● మాలధారణతో ప్రయోజనాలు

ఉదయం, సాయంత్రం చల్లని నీటితో స్నానం చేయడం వల్ల శరీరంలో శక్తి, ఏకాగ్రత పెరుగుతుంది. శిర స్నానంతో రక్తపోటు తగ్గి మంచి ఆరోగ్యం చేకూరుతుంది. శీతాకాలం స్వాములు నల్లటి వస్త్రాలను ధరిస్తారు. నల్లటి వస్త్రాలు వెచ్చదనాన్ని ఇస్తాయి. చలికాలంలో ఇవి శరీరానికి ఉపకరిస్తాయి. స్వాములు శని ప్రభావానికి లోనుకాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని గురుస్వాములు అంటున్నారు. నుదుటన చందనం, విభూది, కుంకుమ పెట్టడం వల్ల చల్లధనంతో పాటు మానసిక ప్రశాంతత కల్గుతుంది. కాళ్లకు చెప్పులు లేకపోవడం వల్ల నడిచేటప్పుడు చిన్నచిన్న రాళ్లు తగిలి రక్త ప్రసరణ బాగా అవుతుంది. శాఖాహారంతో ఆరోగ్యకరంగా ఉండడంతో పాటు మంచి దినచర్య అలవడుతుంది.

నెల రోజులపాటు భిక్ష

బత్తలపల్లి: బత్తలపల్లి అయ్యప్ప దేవాలయం లో మాలధారులకు నెల రోజుల పాటు నిర్వ హించే అన్న సంతర్పణం (భిక్ష) కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రారంభిం చారు. మొదట ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. కార్యక్రమంలో గురుస్వామి శెట్టప్ప స్వామి, జక్కంపూటి పురుషోత్తంచౌదరి, అక్కిం ప్రతాప్, రంగానా యుడు, బోజ్జప్ప, చిట్టి, తిక్కస్వామి, వెంగముని, సూరి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన పెరుగుతోంది



స్వామి మాలధారణతో భక్తిభావం పెరిగి గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన నెలకొంటుంది. స్వామి మాలధారణతో మంచి ఆరోగ్యంతో పాటు ప్రశాంతత లభిస్తుంది. ప్రవర్తనలో చాలా మార్పు వస్తుంది.

- పీజే విజయ్‌కుమార్, గురుస్వామి, ధర్మవరం

చెడు అలవాట్లకు దూరం



మాలధారణ వల్ల చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు ఉపయోగపడుతుంది. ఆరోగ్యకరంగా మారి క్రమశిక్షణగా ఉంటారు. మానసిక ప్రశాంతత ఉంటుంది. దైవభక్తి పెంపొందుతుంది.

-పెద్దన్న, గురుస్వామి, కొత్తచెరువు

భగవద్గీత పఠన పోటీలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రముఖులు

కదిరి అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సాయిబాబా మందిరంలో భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయి పోటీలకు వివిధ ప్రాంతల నుంచి చిన్నారులు పాల్గొన్నారు 6, 7 తరగతుల విద్యార్థులు ఒక విభాగం, 8,9 తరగతుల విద్యార్థులు మరో విభాగంగా ఈ పోటీలు నిర్వహించారు. ప్రతి విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపిక చేశారు. 6,7 తరగతుల విభాగంలో లాస్య, జాహ్నవి, లహరి, 8, 9 తరగతుల విభాగంలో ధనుష్, ఉదయిని, నితీస్ బహుమతులు సాధించారు. 700 శ్లోకాల విభాగంలో రవికిరణ్‌సాయి, కళ్యాణి, లక్ష్మీ, శాంతమ్మ ప్రతిభచాటారు. వీరికి జిల్లా ఇన్‌చార్జిలు ధర్మాచారులు శేషాద్రి, రామమోహన్‌రెడ్డి ప్రసంసాపత్రాలు అందించారు. న్యాయనిర్ణేతలుగా పట్టణానికి చెందిన సీవీ. రమణ, సుందర్‌మోహన్‌రెడ్డి, శర్మ, టీటీడీ ధర్మప్రచార పరిషత్ అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జీ బాబు వ్యవహరించారు.

అంధకారంలో గ్రంథాలయాలు

- రూ.7 కోట్లకు చేరిన సెస్ బకాయిలు
- వసూలైనా జమచేయని సంస్థలు
- నిధులు లేక భారంగా మారిన నిర్వహణ
- ఉద్యోగులకు అందని వేతనాలు



ధర్మవరం శాఖా గ్రంథాలయం

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నిధులు లేక ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాలు అంధకారంలో ఉండిపోతున్నాయి. పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్లు పన్నుల్లో గ్రంథాలయాల నిర్వహణకు సెస్‌ను కూడా కలిపి వసూలు చేస్తున్నాయి. అయితే ఆ డబ్బులను గ్రంథాలయాల ఖాతాకు జయ చేయకపోవడంతో వాటి నిర్వహణ రోజురోజుకూ కష్టతరంగా మారుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలకు దాదాపు రూ.7కోట్ల వరకు సెస్ బకాయిలు నిలిచిపోయాయి. దీంతో గ్రంథాలయాల్లో సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి చేరుకున్నాయి. 010 పద్దు కింద అక్టోబరు నుంచి ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వడం లేదు. నిధులు లేకపోవడంతో కొన్ని మండల కేంద్రాల్లో గ్రంథాలయాలను అధికారులే చేతి నుంచి డబ్బులు చెల్లించి నిర్వహిస్తున్నారు. ఇలా గ్రంథాలయాలు నిధుల లేమితో సతమతం అవుతుండగా.. గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఏవీ ఇవ్వకుండా గ్రంథాలయ వారోత్సవాలను ఖచ్చితంగా నిర్వహించాల్సిందేనని అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులే సొంత డబ్బులతో ఆ వారోత్సవాలను నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలోనైనా గ్రంథాలయాలకు రావాల్సిన సెస్ బకాయిలను విడుదల చేయించి గ్రంథాలయ నిర్వహణకు సహకరించాలని ఆశాఖ ఉద్యోగులు కోరుతున్నారు. లేకుంటే గ్రంథాలయాలు మూత పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



పంచాయతీలు, మున్సిపాల్టీల ద్వారా గ్రంథాలయాలకు అందాల్సిన సెస్‌ను ప్రభుత్వం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. కోట్లలో గ్రంథాలయాల సెస్ బకాయిలు నిలిచిపోయాయి. దీంతో గ్రంథాలయాల నిర్వహణ కష్టంగా మారింది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సెస్ బకాయిలు వచ్చేలా చూడాలి.

- జయరాం, జిల్లా గ్రంథాలయాల అధ్యక్షుడు

పాడైపోతున్నా... పట్టదా?

- జిల్లాలో పట్టుబడ్డ వాహనాలతో పోలీస్‌స్టేషన్లు ఫుల్
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పుపడుతున్నవైనం
- మాయమవుతున్న వాహనాల విడిభాగాలు
- సకాలంలో వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం

కొత్తచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలుకేసుల్లో స్వాధీనం చేసుకున్న వందలాది వాహనాలు పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి మగ్గుతున్నాయి. దొంగతనాలకు ఉపయోగిస్తూ.. అక్రమంగా ఇసుక, ఎర్రచందనం, గంజాయి, మద్యం రవాణా చేస్తూ, రోడ్డు ప్రమాదాల్లో.. సరైయిన రికార్డులు లేకపోవడం.. తదితర కేసుల్లో పోలీసులు, అధికారులు పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇలా స్వాధీనం చేసుకున్న బైక్‌లు, ఆటోలు, సుమోలు, కార్లు, ట్రాక్టర్లు, స్కార్పియోలు, ఐచర్, లారీలు తదితర వాహనాలు సంవత్సరాల తరబడి ఆయా కార్యాలయాల్లో ఉంటున్నాయి. ఆ వాహనాలను ఎలా విడిపించుకోవాలో యజమానులకు తెలీక వాటిని వదిలేసుకుంటున్నారు. దీంతో ఆ వాహనాలు తుప్పుపట్టి.. శిథిలావస్థకు చేరుకు న్నాయి. దీంతో జిల్లాలోని పోలీసు స్టేషన్లు గుజరీ దుకాణాలను తలపిస్తున్నాయి.

● విడిభాగాలు మాయం

అక్రమంగా వస్తువులు, సరుకు తరలించడానికి సాధారణంగా మంచి కండీషన్‌లో ఉన్న వాహనాలనే వాడతారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, అధికారులు స్టేషన్లలో ఉంచుతున్నారు. అలాంటి వాహనాల విడిభాగాలను కొంత మంది సిబ్బంది అమ్ముకొంటూ సొమ్ము చేసుకొంటున్నారే ఆరోపణలు బలంగా ఉన్నాయి. బ్యాటరీలు, టైర్లు, ఇంజన్లు, ఖరీదైన విడిభాగా లను యథేశ్చగా విక్రయిం చుకొంటు న్నట్లు విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు ఈ విషయం తెలిసినా.. ఆ అవినీతిపరులపై చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. పట్టుబడిన వాహ నాలను ఎప్పటికప్పుడు వేలంలో విక్రయిస్తే వాటి యజమానులు గానీ, ఇతరులు గానీ కొనడానికి పోటీపడతారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయమూ సమకూరే అవకాశం ఉంది.

● ఇలా పొందవచ్చు

ఏదైనా కేసులో పట్టుబడ్డ వాహనాలను కోర్టు ద్వారా పొందవచ్చు. ఆర్‌సీ, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను లాయర్ సమక్షంలో కోర్టులో దరఖాస్తు చేసుకొని ఆ వాహనాన్ని పొందవచ్చు. లేదా పోలీసులు ఆ వాహనాలను కోర్టుకు అప్పగించినపుడు సెక్షన్ 451 సీఆర్‌పీసీ ప్రకారం వాహనం యజమాని లాయర్ ద్వారా పొందవచ్చు. ఒక వేళ పోలీసులు కోర్టుకు సమాచారం ఇచ్చి వాహనం అప్పగించకుంటే సెక్షన్ 457 సీఆర్‌పీసీ ప్రకారం లాయర్ సమక్షంలో దరకాస్తు చేసుకొని పొందవచ్చు. కేసు నమోదై విచారణ పూర్తియిన ఆరు నెలల లోపు యజమాని వాహనాన్ని తీసుకోకుంటే కోర్టు వేలం వేయడానికి ఉత్తర్వులు ఇస్తుంది. సెక్షన్ 458 సీఆర్‌పీసీ ప్రకారం ఆ వాహనాన్ని వేలం ద్వారా లేదా తక్కువగా ధరకు పోలీసులే విక్రయిస్తారు.

మద్యం కేసుల్లోనే ఎక్కువ

సత్యసాయి జిల్లాలో ఎక్కువ వాహనాలను మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నవే. ఆ వాహనాలను ప్రభుత్వ అనుమతుతో ఎక్సైజ్ శాఖకు అందజేస్తాం. ఇక వివిధ నేరాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేస్తాం. పాత వాహనాలను సెక్షన్ 102 స్క్రాబ్ కింద వేలం వేస్తాం.

-రత్న, ఎస్పీ





కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలు, తుప్పుపట్టిన వాహనాలతో గుజరీ షాప్‌ను తలపిస్తున్న గోరంట్ల పోలీస్ స్టేషన్

క్రైం న్యూస్ ..

ఆటో డ్రైవర్‌పై దాడి



బాధితుడు ఆంజనేయులు

అనంతపురం క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : స్థానిక రైల్వేస్టేషన్ ఆటోస్టాండ్ వద్ద ఓ ఆటోడ్రైవర్‌పై ఆర్టీసీ డ్రైవర్ ఆదివారం దాడి చేశాడు. ధర్మవరం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కాశీంవలి ఆదివారం సాయంత్రం అనంతపురం వచ్చాడు. రైల్వేస్టేషన్ ఆటో స్టాండ్ వద్దకు వచ్చాడు. రెండో రోడ్డుకు వస్తావా అని ఆటో డ్రైవర్ అంజనేయులను అడిగాడు. అతను రూ.50 అవుతుందని చెప్పగా.. నేను ఆర్టీసీ డ్రైవర్‌ను.. డబ్బులివ్వాలా.. అంటూ మండిపడ్డాడు. మాటా.. మాటా పెరిగి.. కాశీంవలి ఆటోలో ఉన్న అంజనేయులను కాలర్ బట్టుకుని లాగడంలో రోడ్డుపై పడ్డాడు. దీంతో అతని కాలు విరిగింది. అయినా కాశీంవలి దాడి చేస్తూనే ఉండటంతో తోటి ఆటో డ్రైవర్లు అతన్ని అడ్డుకున్నారు. అంజనేయులను స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

గంజాయి మత్తులో..



కార్తీక్ తలకు తగిలిన దెబ్బ

కొత్తచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బుక్కపట్నంకు వెళ్లే రహ దారిలోని తేరు వద్ద గంజాయి మత్తులో ఆదివారం సాయంత్రం సమిటి భరత్, వడ్డే కార్తీక్ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. కార్తీక్‌పై చెక్కతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో సమిటి భరత్ పారిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ కార్తీక్‌ను ప్రభు త్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్టు

నల్లచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెవాండ్లపల్లి గ్రామంలో జూదమాడుతున్న ఐదుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మగ్బుల్‌బాషా తెలిపారు. వారి నుంచి రూ.14,500 స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని అన్నారు. ఈ దాడిలో పోలీసులు ప్రతాప్, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

ఇసుక వాహనాల స్వాధీనం

బత్తలపల్లి డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రవతి నది నుంచి ఆదివారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను బత్తలపల్లి బైపాస్‌లో సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు రామాపురం సమీపంలో చిత్రవతి నది నుంచి అక్రమంగా తరలిసున్న మరో టిప్పర్‌ను పట్టుకున్నారు. రామాపురం వద్ద ఇసుక డంపు చేస్తున్న ఎక్స్‌కవేటర్‌నూ సీజ్ చేసి.. స్టేషన్‌కు తరలించారు. ఆ ఇసుక డంపుల గురించి రెవెన్యు అధికారులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేపట్టారు.



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక చక్రవర్తి థియేటర్ సమీపంలోని కాలభైరవస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలను పూజారి ధనుంజయ ఆచారి నిర్వహించారు. ఆలయంలో దోషనివారణ పూజలు చేశారు. స్వామి ఉత్సవమూర్తికి భక్తులతో అభిషేకాలు చేయించారు. సాయంత్రం ప్రదోషకాలం, అమావాస్య గడియల్లో కూష్మాండ దీపోత్సవాన్ని ప్రారంభించారు. భైరవుని ఎదుట గుమ్మడికాయలపై దీపాలు వెలిగించారు.

టీడీపీ సభ్యత్వాలు పెంచాలి

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వాలు పెంచాలనీ, రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో ఉంచాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదివారం ప్రకటనలో కోరారు. గత ఏడాది కూడా మొదటిస్థానంలో నిలిచిందన్నారు.

13 నుంచి భక్తరహళ్లి బ్రహ్మోత్సవాలు

మడకశిర రూరల్ , డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు 13 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. 14న స్వామివారి కళ్యాణోత్సవం, 15న బ్రహ్మరథోత్సవం ఉంటాయన్నారు.

న్యూస్‌బాక్స్

13 నుంచి భక్తరహళ్లి బ్రహ్మోత్సవాలు

మడకశిర రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధిచెందిన భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు డిసెంబరు 13 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. 13న స్వామివారి ధ్వజారోహణ, అంకురార్పణ, 14న స్వామివారి కళ్యాణోత్సవం, 15న బ్రహ్మరథోత్సవం, 16నజ్యోతుల పరుష, భూతప్పల ఉత్సవం, 17న తలనీలాలు, 18న కంబాల నరసింహ స్వామి పరుష, శయనోత్సవం 19న వసంతోత్సవం జరుగుతాయన్నారు. స్వామి చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గోరంట్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయు రాష్ట్రప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డిని జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు దామోదర్‌రెడ్డి, మండల నాయకులు కోరారు. అనంతపురంలో పీఆర్‌టీయు జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించగా, ఆయన హాజ రయ్యారు. ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, వెంటనే పీఆర్‌సీ అమలుచేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయులకు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందచేసినట్లు వారు ఓప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు మండలాధ్యక్షలు నరేంద్రరెడ్డి, బయ్యారెడ్డి, రామాంజనేయులు, సుధాకర్ రెడ్డి తదితరులున్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు 16సంవత్సరాలుగా సేవలందిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ అధీనంలో పనిచేస్తున్న ఉద్యోగులను వైసీపీ ప్రభుత్వం అరబిందో యాజమాన్యానికి అప్పగించిందన్నారు. నాలుగున్నరేళ్లలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకంటే తక్కువ జీతాలకు పనిచేస్తున్నారన్నారు. వీరి సమస్యలు పరిష్కరించాలని అనేక మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. 2020నుంచి పనిచేస్తున్న డ్రైవర్లకు, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థికసాయం


బాధితుడికి నగదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రంగేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అంజినప్పకు మంత్రి సవిత రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యం కారణంగా అతడి కాలు తొలగించారు. ఈ సమాచారం తెలుసుకున్న మంత్రి సవిత నాయకులద్వారా సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ, సర్పంచ్ నరసింహులు, కిష్టప్ప, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, జనసేన నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

బాలికలు ధైర్యంగా ఉండాలి: డీఎస్పీ


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

సోమందేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బాలికలు ధైర్యంగా ఉంటేనే రాణిస్తారని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్దగల కేజీబీవీ పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తమపట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మౌనంగా భరిస్తూ పోతే హింసించడం, అవమానించడం సర్వసాధారణంగా మారుతుందన్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని ప్రతిఘటించే శక్తిసామర్థ్యాలను అలవర్చుకోవాలన్నారు. అనంతరం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు.

నేడు చేపలచెరువు వేలం

గుడిబండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫళారం చేపల చెరువును వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మీ తెలిపారు. సోమవారం దేవరహట్టి పంచాయతీ కార్యాలయ ఆవరణంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈఓఆర్‌డీ నాగరాజునాయక్, సర్పంచు సతీష్‌బాబు ఆధ్వర్యంలో వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆమె కోరారు.

అజ్జయ్యస్వామికి పూజలు

గుడిబండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళికెర, ఎస్.రాయాపురం గ్రామ సమీపంలో అజ్జయ్యస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా అజ్జయ్యస్వామిని పూలతో అలంకరించి స్వామికి బొరుగులను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భజన కార్యక్రమాలు చేపట్టారు.

సభ్యత్వ నమోదులో మొదటిస్థానం

సోమందేపల్లి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో సోమందేపల్లి మండలం మాగేచెరువు పంచాయతీ నియోజకవర్గంలోనే మొదటిస్థానంలో నిలవడం హర్షణీయమని సర్పంచ్ నరసింహులు, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ పేర్కొన్నారు. పంచాయతీ గ్రామాల్లో పార్టీ సభ్యత్వం ప్రారంభించిననాటి నుంచి ప్రజలకు అవగాహన కల్పిస్తూ వస్తున్నారన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని తీసుకొన్నారన్నారు.

కదలని కాంపాక్ట్ వాహనం

గుట్టలుగా చెత్త



● చెత్త కుళ్లిపోవడంతో వ్యాపిస్తున్న దుర్వాసన

● తరచూ మరమ్మతులకు గురవుతున్న చెత్తవాహనం

● పెరుగుతున్న దోమల బెడద - ప్రజలకు రోగాల భయం

మడకశిరటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా నగర పంచాయతీ పరిధిలో చెత్త ఎక్కడికక్కడ కుప్పలుగా పేరుకుపోతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తరలించే వాహనానికి సకాలంలో అధికారులు మరమ్మతు చేయించకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. చెత్తను తరలించే కాంపాక్ట్ వాహనం కార్యాలయం ముందు అలంకార ప్రాయంగా నిలబడి ఉంది. గత మూడు నెలల నుండి పరిస్థితి ఇలానే ఉన్నా అధికారులు మాత్రం పరిష్కారానికి చొరవ చూపడం లేదు. ట్రాక్టర్ సాయంతో కొన్ని పాయింట్‌లలో చెత్తను తొలగిస్తున్నా రోజూ తొలగించేందుకు వీలు కాకపోవడం వల్ల కొన్ని కాలనీల్లో చెత్త పేరు


ఆగిపోయిన కంపాక్ట్ వాహనం

కుపోయి దోమల బెడద సైతం అధికమవుతోందని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నా డీజిల్‌కు మాత్రం డబ్బు డ్రా చేస్తున్నట్లు నగర పంచాయతీ అధికారులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు నెలకు 15 నుండి 20 లీటర్ల డీజిల్ బిల్లులను డ్రా చేసుకొంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. స్వచ్ఛాంధ్ర ఆటోలు ఆరు ఉండగా అందులో మూడు మాత్రమే చెత్తను తరలించేందుకు వాడుతున్నారు. మిగిలిన మూడు మరమ్మతులకు గురికావడం వల్ల కార్యాలయం వద్ద నిలిచిపోయాయి. ఒకవైపు చిరుజల్లులు కురుస్తుండటం, చెత్త పేరుకుపోవడం వల్ల దోమల బెడద అధికమై సీజనల్ వ్యాధులు సైతం ప్రబలుతున్నాయని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. . కంపాక్ట్ వాహన మరమ్మతుల కోసం పలువురు మెకానిక్‌లు వెళ్లగా అందుకు కొటేషన్లు వేసి మరమ్మతులు చేసే అవకాశం కల్పించడం లేదని అంటున్నారు. కౌన్సిల్ సమావేశంలో సభ్యులు సైతం ఈ సమస్యలను ప్రస్తావించడం లేదని అంటున్నారు. వాహనం మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయించి వెంటనే మరమ్మతులు చేయించాలని, కాలనీల్లో చెత్తను రోజూ శుభ్రం చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

యార్డు లేకపోవడం వల్ల రోడ్డు పక్కనే చెత్త

మడకశిర నగర పంచాయతీ కొత్తగా ఏర్పడి దాదాపు 10 సంవత్సరాలు కావస్తున్నా కాలనీల్లో సేకరించే చెత్త వేసేందుకు యార్డు సౌకర్యం మాత్రం కల్పించలేకపోయారు. గతంలో పెద్ద వంకవద్ద డంప్ చేసేవారు. ప్రస్తుతం రోడ్డు పక్కన చెత్త వేయడం వలన ఇబ్బందులెదురవుతున్న దృష్ట్యా యార్డు సౌకర్యం కల్పించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

చెత్త వాహనం మరమ్మతులకు చర్యలు

కంపాక్ట్ వాహనం తరచూ మరమ్మతులకు గురవుతున్న మాట వాస్తవమే. దానిని రిపేరు చేయించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నాం. అనంతపురం నుండి మెకానిక్‌లు సైతం మరమ్మతులు చేసేందుకు రెండు రోజుల్లోపు వస్తున్నారు. డీజిల్ స్వాహా చేస్తున్నారన్న మాట అవాస్తవం. వాహనాలు నడిపిన రోజు మాత్రమే అందుకు సంబంధించిన బిల్లులు డ్రా చేస్తున్నాం.


కమీషనర్ రంగస్వామి

మంత్రి సమీక్ష


గోరంట్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

గోరంట్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గంగంపల్లి, గౌనివారిపల్లి, కరావులపల్లి తాండా, మందలపల్లి, గడ్డంతండా పంచాయతీల సమస్యలపై బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖమంత్రి సవిత ఆదివారం సమీక్షించారు. మండలంలోని ఐదు పంచాయతీల పరిధిలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని భవిష్యత్‌లో చేపట్టనున్న అభివృద్ధిపై మంత్రి చర్చించారు. తాగునీరు, రోడ్లు, మురుగునీటి కాలువల ఏర్పాట్లు తదితర సౌకర్యాల ఏర్పాటుపై ఆమె దృష్టిసారించారు. టీడీపీ సభ్యత్వనమోదును గ్రామాల వారీగా చర్చించి, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో కన్వీనర్ సోమశేఖర్, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, డీలర్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయానికి పోటెత్తిన పర్యాటకులు


పర్యాటకులతో కిటకిటలాడుతున్న నంది విగ్రహ ప్రాంతం

లేపాక్షి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం చివరిరోజు ఆదివారం లేపాక్షి దుర్గావీరభద్రస్వామి ఆలయానికి భక్తులు, పర్యాటకులు పోటెత్తారు. దుర్గా వీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తాదులకు తీర్థప్రసాదాలు అందించారు. నంది విగ్రహం, జటాయువుపక్షి ప్రాంగణం పర్యాటకులతో నిండిపోయాయి.

రుణాల మంజూరులో నిర్లక్ష్యం

● నిధులు లేవంటూ ప్రచారం

● సిబ్బంది తీరుపై డ్వాక్రా మహిళల అసహనం

లేపాక్షి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణం పూర్తిగా చెల్లించి రెండు నెలలైనా ఇప్పటివరకు కొత్తది మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని డ్వాక్రా మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్వాక్రా మహిళలకు అందించే పథకాలలో ఒకటైన శ్రీనిధి రుణం సంఘంలోని చిరు వ్యాపారులకు చేతి వృత్తులు నిర్వహించే వ్యాపారులకు, వెలుగు సిబ్బంది అందిస్తుంటారు. అయితే గతంలో తీసుకున్న శ్రీనిధి రుణం పూర్తిగా చెల్లించినా, మళ్లీ రుణం ఇవ్వడానికి ఫండ్ లేదంటూ సిబ్బంది కట్టుకథలు అల్లుతున్నారంటూ డ్వాక్రా మహిళలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం పెద్దపీట వేస్తున్నారని, అలాంటి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు కోరుతున్నారు. గత ప్రభుత్వంతో అంటకాగిన అధికారులే నేటికి కొనసాగుతున్నారని, వారిని బదిలీచేస్తే తప్ప అర్హులకు రుణాలు అందవని మండల ప్రజలు అంటున్నారు. అంతేకాకుండా టీడీపీప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న వీరిని వెంటనే బదిలీ చేయాలని డ్వాక్రా సం ఘాల మహిళలు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ


వెలుగు కార్యాలయం

రుణాలను సైతం సిబ్బంది వారి బంధువులకే మంజూరు చేస్తున్నారని మండల ప్రజలు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి వెంటనే శ్రీనిధి రుణాలు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శివయ్యకు అన్నాభిషేకం

హిందూపురం అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని డి.బి కాలనీలోని వాసవీమాత ఆలయంలో పరమశివునికి అన్నాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం ఆఖరి రోజు అమావాస్య ఆదివారం రావడంతో విశేష పరమేశ్వరుడిని అన్నంతో అభిషేకించారు. జనులంతా దుర్భిక్షం నుంచి దూరమవ్వాలని ఈశ్వరున్ని ప్రార్థించారు. వేద పండితులు మంత్రోచ్ఛారణలతో, అన్నపూర్ణాదేవి కరుణా కటాక్షాలు నిండుగా మెండుగా అందరికీ అందాలని అభిషేకించిన అన్నాన్ని ప్రసాదంగా అందించారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్మీ, సీతారామంజనేయ విగ్రహాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.


అన్నంతో అభిషేకం చేస్తున్న దృశ్యం

లక్షదీపోత్సవాలు

కార్తీకమాసం ముగింపు సందర్భంగా లక్షదీపోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించి పార్వతీనాధున్ని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌బి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్

హిందూపురం అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):ఎయిడ్స్ రహిత సమాజస్థాపనకు యువత ముందుకు రావాలని, ఎయిడ్స్ బాధితులను చులకనగా చూడరాదని సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్ పేర్కొన్నాడు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన హిందూ ముస్లీం శాంతి సామరస్య ఐక్యవేదిక కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఎయిడ్స్ బాధితులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఎయిడ్స్ బాధితులకు చీరలు, ఫ్యాంట్ షర్టు, నోటు పుస్తకాలు, పండ్లు అందించారు. కార్యక్రమంలో ఇన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడు, టూటౌన్ సీఐ కరీం, ఏపీపీ ఇందాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజస్థాపనకు



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


మడకశిరలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ

యువత ముందుకు రావాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆసుపత్రి ఐసీటీసీ ఆధ్వర్యంలో వైద్యులు సౌమ్య, ఆయిష, ఆధ్వర్యంలో సిబ్బంది బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఎయిడ్స్ డే సందర్భంగా ర్యాలీ

మడకశిరటౌన్/రొళ్ల, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మడకశిర పట్టణంలో ఆదివారం ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్లు నేహ, ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బదిరీష్, మేనేజర్ అశ్వర్థనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. రొళ్ల ప్రభుత్వ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం, ఐసీటీసీ సంస్థ వారి ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రొళ్లలో అవగాహన ర్యాలీ, మానవహారంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు.

సిద్దేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు

అమరాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండలంలోని శ్రీహెంజేరు సిద్దేశ్వరస్వామి వారికి ఆదివారం కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా సిద్దేశ్వరస్వామికి వివిధ అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, తైలాభిషేకం జరిపించారు. ప్రత్యేకఅలంకరణ చేసి మహా మంగళ హారతి ఇచ్చి తీర్థప్రసాదం పంచిపెట్టారు. అదేవిధంగా స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకాలభైరవేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి దేవాలయాల్లో కార్తీక మాసం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్‌స్వామి, సిద్దలింగేశ్వరస్వామి, మహేష్‌కుమార్, గౌతమ్, ప్రదీప్‌లు తెలిపారు. స్వామి వారి సేవలో నిమగ్నులైన భక్తులకు శ్రీసిద్దేశ్వరస్వామి దర్శనభాగ్యం కల్పించారు. ఈప్రాంతం భక్తులే కాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ మెంబర్ కరేగౌడ్ అన్నదానం ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకరణలో సిద్దేశ్వరస్వామి

మినీలారీ, ఆటో ఢీ-నలుగురికి గాయాలు


తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మారుతి, నందీష్, పవన్

హిందూపురం అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఏ వన్ స్టీల్ ఫ్యాక్టరీ ముందు ఆదివారం సాయంత్రం ఆటోను మినీలారీ ఢీకొంది. ఈ ఘటనలో మణే సముద్రం గ్రామానికి చెందిన మారుతి, పవన్‌కల్యాణ్, నందీష్, రవిలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు హిందూపురం వైపు నుంచి మణేసముద్రంకు ఆటోలో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. పెనుకొండ వైపు నుంచి లారీ హిందూపురంకు వస్తుంది. ఏ వన్ స్టీల్ ఫ్యాక్టరీ వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికుల సమాచరంతో 108 వాహనం ద్వారా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలు అందించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ ఘటనలో మారుతికి తలకు తీవ్ర గాయాలుకాగా, రవికి వీపు భాగంలో గాయాలు తగిలాయి. నందీష్, పవన్‌లకు తలకు, చేతులకు గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెనుకొండ రూరల్, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తున్న లారీ గుట్టూరుకు రాగానే స్పీడ్ బ్రేకర్‌వద్ద ఒక్కసారిగా బ్రేక్‌వేయడంతో వెనుకే వస్తున్న బొలెరో వాహనం దానిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలేరో డ్రైవర్ ఓబుళపతికి స్వల్పగాయాలయ్యాయి. బొలేరో వాహనం పాక్షికంగా దెబ్బతింది. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని పాడి ఆవు మృతి

గోరంట్ల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై మిషన్‌తండా పెట్రోల్ బంక్ వద్ద లారీ ఢీకొని పాడి ఆవు ఆదివారం మృతిచెందింది. పాలసముద్రం పంచాయతీ బెల్లాలచెరువు గ్రామానికి చెందిన రైతు బోయ ఉత్తప్ప పాడి ఆవును మేతకోసం తీసుకెళ్లారు. ఆవు జాతీయ రహదారిని దాటుతుండగా అనంతపురంనుంచి బెంగుళూరు వైపు వెళ్తున్న పంజాబ్‌రాష్ట్రానికి చెందిన లారీ ఢీకొనడంతో అది తీవ్రంగా గాయపడింది. లేవలేని స్థితిలో రోడ్డు పక్కనే గంటపాటు ప్రాణాపాయ స్థితిలో విలవిలలాడుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌బాబు సంఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన ఆవును చికిత్స నిమిత్తం తరలించాలని ప్రయత్నించినా, వీలుకాలేదు. అనంతరం కొంత సమయానికి మృతిచెందింది. రూ.80వేలు విలువ చేసే ఆవు, పూటకు 8 లీటర్ల పాలు ఇచ్చేందని బాధ రైతులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

14న దత్త జయంతి

పెనుకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ షిర్డీగా పేరుగాంచిన పెనుకొండ పట్టణంలోని షిర్డీ సాయి మందిరంలో ఈనెల 14న దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యశాస్త్రి కమిటీ అధ్యక్షులు రఘునాథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు భజనమండలి సభ్యులు జోలిపట్టి వీధి వీధి తిరుగుతూ ఇంటింటికి వెళ్లి దత్త భిక్ష స్వీకరించారు. దత్త జయంతి కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సుబ్రమణ్యశాస్త్రి, భజన మండలి సభ్యులు శంకర్, మురళి, భక్తులు పాల్గొన్నారు.


దత్త భిక్షలో భక్తులు

దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోరుతూ సీఎంకు లేఖ


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పావగడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వికలాంగుల సంక్షేమ అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఎమ్మెల్యే హెచ్.వి. వెంకటేష్ ద్వారా వినతిపత్రం పంపారు. ఈ సందర్భంగా వికలాంగుల గ్రామీణ పునర్వసతి కార్యక్రమం పథకం కింద సమస్యలను పరిష్కరించాలని కోరారు. వికలాంగుల అభివృద్ధి కోసం అనేక సంవత్సరాల నుండి గ్రామీణ ప్రాంతాలలో ఎంఆర్‌డబ్ల్యు, వీఆర్‌డబ్ల్యు పునర్వసతి కేంద్రాలను ఏర్పాటుచేసి గ్రామీణ ప్రాంతాల వికలాంగులకు ప్రభుత్వ పథకాలను అందజేయడానికి ఎంతో కృషిచేస్తుండటం గర్వించదగ్గ విషయమని తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎంఆర్‌డబ్ల్యు, వీఆర్‌డబ్ల్యుగా పనిచేస్తున్న వీరందరినీ చట్టబద్ధం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు.

ఈసందర్భంగా ఎంఆర్‌డబ్ల్యు నాయకులు మైలారిరెడ్డి, ఆదిలక్ష్మీ, రామాంజనేయ, అనేక మంది వికలాంగులు కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

శాంతి బృందావనంలో కార్తీకమాస పూజలు

పావగడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న శాంతి బృందావనంలో కార్తీక మాసం చివరిరోజైన ఆదివారం లక్షదీపోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించి భక్తిని చాటుకొన్నారు. శాంతి బృందావనంలో నెలకొన్న శివుని విగ్రహం, గణపతి, రాధాకృష్ణ, సాయిబాబా విగ్రహాలకు ఘనంగా పూజలు చేసి దీపాలను వెలిగించారు. వేలాది మంది మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు.

మోడల్‌టెస్టుతో భయం.. దూరం..

మడకశిరటౌన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న భయం తొలగించేందుకు మోడల్ టెస్టు ఎంతగానో దోహద పడుతుందని ఎంఈఓ శ్రీనివాసభాస్కర్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్‌ఎంఎంఎస్ మోడల్ టెస్టును నిర్వహించారు. ఈనెల 8వతేదీన నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం 8వతరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 200 మంది విద్యార్థులు హాజరయ్యారు.


పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ